సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 6 । జూన్ । 2025

న్యూస్‌రీల్

'వెన్నుపోటు దినం' విజయవంతమైంది



- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అమలు కాని హామీలు ఇచ్చి, అధికారం చేతికొచ్చాక ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన వెన్నుపోటు దినం విజయవంతమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 నియోజక వర్గ కేంద్రాల్లో ఈ నిరసన కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చారని తెలిపారు. కూటమిపై ఉన్న ప్రజా వ్యతిరేకతకు ఇది నిదర్శనమన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామికి ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో జ్యేష్ఠ మాసం గురువారం రాత్రి ముఖలింగేశ్వర సహిత వారాహి అమ్మవారి పాంచరాత్ర కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజతో ప్రారంభమై ఘనంగా ధ్వజారోహణ జరిగింది. పుణ్యాహవచనం, మంటపారాధన, బలిహరణ నిర్వహించి ముంగళం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రభాకరరావు, అర్చకులు చలం ,నారాయణమూర్తి, శ్రీకృష్ణ శివాజీ తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



మొదటిర్యాంకు వచ్చిన చిరంజీవికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల: ప్రభుత్వ ఐటీఐ ఎచ్చెర్ల కళాశాలలో ఐటీఐ ప్రవేశాలకు గురువారం మొదటివిడత కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ పాల్గొని మొదటిర్యాంకు వచ్చిన కుశాలపురం గ్రామానికి చెందిన పి.చిరంజీవి అనే విద్యార్థికి అడ్మిషన్ అందించారు. అనంతరం కౌన్సిలింగ్‌ను కొనసాగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మాట్లాడుతూ మొదటి కౌన్సెలింగ్‌కు 277 మందిని పిలిచామని, 109 మంది హాజరయ్యారని తెలిపారు. వీరిలో 101 మందిని ప్రవేశాలకు ఎంపిక చేశామన్నారు.

'జీడి పరిశ్రమలు తెరవాలి'



మాట్లాడుతున్న కాష్యూ లేబర్ అసోషియేషన్ నాయకులు, కార్మికులు

కాశీబుగ్గ: పలాసలో జీడి పరిశ్రమలు బంద్ చేయడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తెరిపించాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ లేబర్ కాలనీ నాయకులు శిష్టు గోపి, అంబటి ఆనంద్, సీఐటీయూ నాయకులు నెయ్యిల గణపతి, పి.లక్ష్మీపతి డిమాండ్ చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వవార్డు లేబర్ కాలనీలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అనుమతులు లేకుండా పరిశ్రమలు బంద్ చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. లాభాలు వచ్చినపుడు కార్మికులకు ఇన్సెంటివ్ ఏమీ ఇవ్వడం లేదని, నష్టాల పేరుతో పరిశ్రమలు మూసివేయడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. మూసివేసిన కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా ఆలయ ప్రతిష్టాపన



టెక్కలి: సంతబొమ్మాళి మండలం కాశీపురం గ్రామంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయ ప్రతిష్టాపన నిర్వహించారు. పాలపోలమ్మ తల్లి అమ్మవారు, పోతన్న ఆలయాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పల్లెకు సుస్తీ.. వైద్యానికి కుస్తీ





కొన్ని రోజుల కిందట మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా తన నియోజకవర్గంలో పలు పీహెచ్‌సీలు పరిశీలించారు. అందులో పరిస్థితులు గమనించి 'మీ డాక్టర్లకు జీతాలే దండగ.. ఎవ్వరూ సమయానికి రారు.. వచ్చినా..ఉండరు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. పల్లెల్లో వైద్యం ఎంతమాత్రం అందుతుందో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. కానీ ఏడాది కిందటి వరకు పరిస్థితి వేరు. 'ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్' పల్లెను బాగు చేసింది. ఊరి బాగోగులు చూసుకుంది. వీధి ముంగిటే అందరికీ సేవలు అందించి గ్రామీణ వాసులందరికీ చేరువైంది. కూటమి రాకతో 'ఫ్యామిలీ డాక్టర్' మాయమైపోయాడు. పేదలు ప్రభుత్వాస్పత్రి ఓపీలో నిలుచునే ఓపిక తెచ్చుకోవాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసేసింది.

- కూటమి ప్రభుత్వంలో కనిపించని గ్రామీణ వైద్య సేవలు
- గత ప్రభుత్వంలో 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో పల్లె గడపలోనే వైద్య సేవలు
- నాడు 64 పీహెచ్‌సీల పరిధిలో అద్వితీయంగా సాగిన ఎఫ్‌పీసీ విధానం
- నేడు పల్లెల్లో మచ్చుకైనా కనిపించని వైద్య బృందాలు

అరసవల్లి:

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్... దేశంలో మొట్టమొదటి సారిగా ఓ డాక్టర్‌ను ఊరికి పంపించి వారికి పరీక్షలు చేయించి మందులు అందజేసి ఆరోగ్యవంతులను చేసే ఈ మహత్తరమైన పథకానికి వైఎస్ జగన్ రూపకల్పన చేశారు. 2022 అక్టోబర్ 21 నాడు ట్రయల్ రన్‌గా ప్రారంభించిన ఈ విధానం క్రమేణా లక్షలాది మందికి సేవలు అందించింది. పేద, సామాన్యుల కోసం ఏకంగా ప్రభుత్వ వైద్యుడే ఆయా గ్రామాలకు ఫ్యామిలీ డాక్టర్‌గా పరిచయమయ్యేలా ఫోన్ నంబర్ ఇచ్చి మరీ ఫాలో అప్ చేసేవారు. ఉదయం ఓపీ చూసి ఉచిత మందులివ్వడం, సాయంత్రం నుంచి ఇళ్లకు వెళ్లి మంచాన పడిన రోగులను కలిసి మాట్లాడి సలహాలివ్వడం వంటి సేవలు అందించడం జరిగేది. ఈ వ్యవస్థ కోసం ఏకంగా జిల్లాలో 66 పీహెచ్‌సీల్లో 14 మంది సిబ్బంది ఉండేలా కొత్త క్యాడర్‌స్ట్రెంత్‌ను అమలు చేసి కొత్తగా నియామకాలను చేపట్టారు.

మరి నేడు చూస్తే..

గ్రామాల్లో వైద్యసేవలు దేవుడెరుగు.. అసలు పీహెచ్‌సీల్లో వైద్యులే రాని పరిస్థితి నెలకొంది. ఇక జిల్లా వైద్యారోగ్య శాఖ విషయానికొస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక అవినీతి అక్రమాలపై ఉన్న శ్రద్ధ గ్రామీణ వైద్య సేవలపై పెట్టడం లేదు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోనే ఉందని డీఎంహెచ్‌ఓ చెబుతున్నా.. ఎక్కడా ఆ ప్రక్రియ జరగడం లేదు. ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి అప్పట్లో గ్రామాలకు నెలకు రెండు రోజుల చొప్పున విజిట్స్ ఉండేలా షెడ్యూల్ ఉండేది. 104 వాహనంతో పాటుగా పరిధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ స్వయంగా సిబ్బందితో వెళ్లి వైద్య పరీక్షలతో పాటు ఉచిత మందులను ఇవ్వడమే కాకుండా ఇంటింటికీ వెళ్లి ఫాలో అప్ వైద్య సలహాలను ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా 'ఫ్యామిలీ డాక్టర్' మాత్రం అడుగు తీసి అడుగు వెయ్యలేదు.

ఉచితంగా కంటి అద్దాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న పేరు రత్నాల సింహాచలం. ఎల్ఎన్ పేట మండలంలోని బొత్తాడ సింగి గ్రామం. 2023 అక్టోబర్ నెలలో ఎల్.ఎన్.పేట బొత్తాడసింగి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈయనకు కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 20 రోజుల్లో కంటి అద్దాలు ఇచ్చారు. అంతకుముందు ఈయన కళ్లద్దాల కోసం పట్టణాలకు కూడా వెళ్లారు. కానీ జగనన్న ఆరోగ్య సురక్షతో ఊరిలోనే చక్కటి వైద్యం లభించింది. వైఎస్ జగన్ హయాంలో వైద్యరంగం బాగుపడిందని చెప్పడానికి ఈయన కంటి చూపే సాక్షి.

నాడు నియామకాలు..నేడు నిర్లక్ష్యాలు


వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. జిల్లాలో మొత్తం 66 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 591 విలేజి హెల్త్ క్లినిక్స్ ఉండగా.. ఈ ఎఫ్‌పీసీ విధానం కోసం ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండాలనే క్రమంలో మొత్తం 132 మంది కొత్తగా వైద్యులను నియమించింది. అలాగే 14 మంది క్యాడర్ స్ట్రెంత్ కోసం ప్రతి పీహెచ్‌సీలో కొత్తగా 620 వరకు పోస్టులను కూడా భర్తీ చేసింది. అలాగే కొత్తగా మొబైల్‌మెడికల్ యూనిట్ (104వాహనం)లను 25 వాహనాలను జిల్లాకు కేటాయించింది. తగిన టెక్నీషియన్లను కేటాయించింది. దీంతో 2022 అక్టోబర్ 21 నుంచి 2024 ఎన్నికల ముందు వరకు జిల్లాలో సుమారు 3.60 లక్షల మందికి గ్రామీణ వైద్య సేవలందించింది.

కూటమి వచ్చాక పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. ఏడాదిగా ఒక్క నియామకం లేదు సరికదా గత ఏడాది డిసెంబర్ 5న జిల్లాలో మొత్తం 123 మంది కాంట్రాక్ట్ మేల్ హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగాల నుంచి ఉద్వాసన పలికారు. ఇది చాలదన్నట్లుగా నకిలీ జాయినింగ్ ఆర్డర్ల వ్యవహారాలు, జిల్లా కార్యాలయం వేదికగా అక్రమ వ్యవహారాలు నడిచేలా కూటమి పాలకుల చర్యలున్నాయి.



నాడు

నెలకు సరిపడా మందులను ఆనందంగా ఇంటికి తీసుకెళ్తున్న వృద్ధులు



నేడు

ఈదుపురం పీహెచ్‌సీ వద్ద వైద్యం కోసం పడిగాపులు కాస్తున్న రోగులు

గ్రామాల్లోనే 14 రకాల పరీక్షలు

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ విధానంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోకి నెలకు రెండు సార్లు వెళేవారు. ఆయా గ్రామస్తుల్లో వైద్యపరీక్షలు అవసరమైన వారిని గుర్తించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 104 మొబైల్ యూనిట్ సిబ్బంది సమక్షంలో మొత్తం 14 రకాల వైద్య పరీక్షలను అక్కడే నిర్వహించి ఫలితాలను తెలియజేసేలా వ్యవస్థను నడిపించారు. హిమోగ్లోబిన్ టెస్ట్, ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్, మలేరియా టెస్ట్, హెచ్ఐవీ నిర్ధారణ, డెంగీ టెస్ట్, మల్టీ పారా యూరిన్ స్ట్రిప్స్, అయోడిన్ టెస్ట్, గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి నిర్ధారణ, ఫైలేరియాసిస్ టెస్ట్, సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్, విజువల్ ఇన్ఫెక్షన్, స్పుటమ్ (ఏఎఫ్‌బి) తదితర 14 రకాల వైద్య పరీక్షలను గ్రామాల్లోనే నిర్వహించేవారు. కానీ నేడు అలాంటి పరిస్థితులు కానరావడం లేదు. దీంతో ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.



బూర్జ మండలంలో ఓ ఇంటి వద్దనే రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం..



మాది ఎచ్చెర్ల మండలం అల్లినగరం. ఇదివరకు ఇంటి వద్దకు డాక్టర్లు వచ్చి తనిఖీలు చేసి మందులు ఇచ్చేవారు. ఇప్పుడు ఎవరూ రావడం లేదు. చీటికీ మాటికీ ఎచ్చెర్ల ఆస్పత్రికి నడుచుకుంటూ వెళ్లి మందులు తెచ్చుకోవాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. – వై.సూరయ్య, అల్లినగరం, ఎచ్చెర్ల మండలం

ప్రైవేటు వైద్యులే గతి



ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ వల్ల పేదలపై ప్రయాణ భారం పడకుండా ఊరిలోనే వైద్య సేవలు అందేవి. ఇప్పుడు అవన్నీ ఆగిపోయాయి. గతి లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. – గొర్లె శ్రీరాములునాయుడు, మురపాక, లావేరు మండలం.

వైద్య సేవలు తగ్గిపోయాయి



గతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోజూ వైద్యులు ఊరికి వచ్చి మందులు ఇచ్చేవారు. ఉన్నత చికిత్స అవసరమైతే వారే పంపించేవారు. ప్రస్తుతం గ్రామాల్లో వైద్యసేవలు పూర్తిగా కనుమరుగైపోయాయి. – బెవర కృష్ణవేణి, పాతపాడు



ఏడాది పాలన
ఇదేనా బాబూ..

కొత్తపేట కొండలో అక్రమ తవ్వకాలను చూపుతున్న రామకృష్ణారెడ్డి



కొంచమైనా మిగల కొండ

- కొత్తపేట కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- పంచాయతీ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కంకర తరలింపు



టెక్కలి:

టెక్కలి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పంచాయతీ అనుమతులు సైతం తీసుకోకుండా ఇష్టారాజ్యంగా కొండలను తవ్వేసి మైదానాలుగా మార్చేస్తున్నారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఆయా పంచాయతీ, మైనింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో, అడ్డగోలుగా అధిక మెట్రిక్ టన్నుల్లో కంకర తరలింపు చేసేస్తున్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 117/1 లో గల కొత్తపేట కొండలో ఇప్పటికే అడ్డగోలుగా కంకర తవ్వకాలు చేసేశారు. అలాగే జర్జంగి పంచాయతీ గుంజిలోవ సమీపంలో సర్వే నంబర్ 53లో సైతం కనీసం పంచాయతీ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కంకర తరలించేస్తున్నారు. రెండు చోట్ల పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై మైనింగ్ జిల్లా అధికారుల వద్ద ప్రస్తావించగా కొత్తపేట కొండపై తవ్వకాల విషయంలో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని, దీనిపై స్థానికంగా రెవెన్యూ అధికారుల సహకారంతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తారని వెల్లడించారు.

అన్యాయంగా కొండను తవ్వేశారు

కొత్తపేట గ్రామంలో ఇందిరమ్మ కాలనీలకు ఆనుకుని ఉన్న కొండపై ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కంకర తవ్వకాలు చేశారు. ముందుగా అనుమతులు ఉన్నాయని భావించాం. ఆ తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని తెలిసి అడ్డుకున్నాం.
– దుక్క రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, కొత్తపేట.

నాయకుల అండతోనే..



కొత్తపేట కొండతో పాటు గుంజిలోవ ప్రాంతంలో అక్రమంగా కంకర తవ్వకాలు చేసి తరలించేశారు. దీనికి మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ అండ ఉంది. – అన్నెపు రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జర్జంగి

హడలెత్తిస్తున్న ఆటో గ్యాంగ్

- వృద్ధ అమాయక దంపతులే లక్ష్యంగా చోరీలు
- జిల్లా కేంద్రం సమీపంలో రెండు చోట్ల దొంగతనాలు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఆటో గ్యాంగ్ దడ పుట్టిస్తోంది. మొన్నటికి మొన్న సింహద్వారం సమీపంలో వృద్ధ దంపతుల బ్యాగును కోసేసిన దుండగులు.. గురువారం కింతలి ఫ్లై ఓవర్ సమీప కె.మార్టు నుంచి కొత్తరోడ్డు వెళ్లేందుకు వస్తున్న వృద్ధ దంపతుల నుంచి మూడు తులాల పుస్తెల తాడు ఉన్న సంచిని కోసేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురానికి చెందిన వృద్ధ దంపతులు సనపల వెంకటరావు, భారతి గత నెల 26న వైద్యం కోసం శ్రీకాకుళం వచ్చారు. చిన్న చిన్న పనులు ముగించుకుని శంకర్ ఫౌండేషన్‌కు వెళ్లేందుకు రామలక్ష్మణ జంక్షన్ సమీపంలో ఆటో ఎక్కారు. డ్రైవర్ తన పక్కనే వృద్ధుడిని కూర్చోబెట్టుకుని, వృద్ధురాలైన భారతిని వెనక సీట్లో కూర్చోమన్నాడు. అప్పటికే వెనక సీట్లో ఇద్దరు మహిళలున్నారు. శంకర్‌ఫౌండేషన్ వద్ద దిగేటప్పుడు బ్యాగు చినిగినట్టు అనిపించినా పట్టించుకోలేదు. పనులన్నీ ముగించుకుని ఇంటికి వెళ్లి చూస్తే బ్యాగులో మూడు బంగారు వస్తువులు లేవు. దీంతో గురువారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదివ్వడంతో ఎస్‌ఐ సందీప్ కేసు నమోదు చేశారు.

టూటౌన్ పరిధిలో..

ఎచ్చెర్ల మండలం కొత్తపేట పంచాయతీ సాకివానిపేటకు చెందిన వృద్ధ దంపతులు కోరాడ రమణ, రామలక్ష్మి గురువారం కింతలి మిల్లు ఫ్లై ఓవర్ సమీప కె.మార్టు వద్ద చిలకపాలెం నుంచి వస్తున్న ఆటో ఎక్కారు. ఇక్కడ కూడా వృద్ధుడిని ముందు కూర్చోబెట్టారు. వెనుక ఇద్దరు మహిళలు ఉన్నారు. సరిగ్గా పాలిటెక్నిక్ కళాశాల సమీప వెంకటేశ్వర మెడికల్ షాప్ వద్దకు వచ్చేసరికి సుమారు 3 తులాలుండే పుస్తెలతాడు కట్ అయ్యి జారినట్లు అనిపించడంతో అప్రమత్తమైన వృద్ధురాలు భర్తకు చెప్పడంతో ఆయన తాడును జేబులో ఉంచాడు. కానీ ఆటోలో ఉన్న మహిళలు జేబులో ఉంటే జారిపోద్ది.. మీ చేతిలో ఉన్న మార్కెట్టు సంచిలో వేయండంటూ చెప్పడంతో అమాయకంగా రామలక్ష్మి అందులో భద్రపర్చింది.. సరిగ్గా లక్ష్మీటాకీస్ సమీప ముత్యాలమ్మ మార్కెట్టుకు వచ్చేసరికి బ్యాగు కింది భాగం చినిగినట్లు అనిపించి వృద్ధదంపతులిద్దరూ కిందకు దిగారు. ఈలోగా ఆటోవాలా పరారయ్యాడు. దీనిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను దంపతులిద్దరూ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆటోల్లో 'సురక్ష' కోడ్‌లు పెట్టినా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు స్పందించి ఆటోగ్యాంగ్‌ను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

458 పోస్టులు.. 22,648 మంది అభ్యర్థులు

- నేటి నుంచి డీఎస్సీ-2025 పరీక్షలు ప్రారంభం
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- మూడు నెలలు గడువిస్తామని చెప్పి 45 రోజుల్లోనే పరీక్షలను కానిచ్చేస్తున్న ప్రభుత్వం
- జూన్ 6 నుంచి 30 వరకు రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షల నిర్వహణ

శ్రీకాకుళం న్యూకాలనీ: డీఎస్సీ-2025 పరీక్షల పర్వం శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ.. ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇందుకు సంబంధించి జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. జూన్ 6వ తేదీ నుంచి 30 వరకు రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.



పరీక్షకు సిద్ధంచేసిన కంప్యూటర్లు

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలను జరపనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆరు కేంద్రాల్లో ఎంఈఓ స్థాయి అధికారులు ఆరుగురిని డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నియమించారు. హాల్‌టిక్కెట్‌పై ఫొటో లేకపోతే పరీక్ష కేంద్రానికి పాస్‌ఫోటో తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా నుంచి 458 పోస్టులను విద్యాశాఖ భర్తీ చేయనుంది. ఈ పోస్టులకు 22648 మంది అభ్యర్థులు.. 39235 దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో పురుషులు 9653 మంది, మహిళలు 12995 మంది ఉన్నారు. నోటిఫికేషన్ వెలువడిన మూడు నెలల తర్వాత పరీక్షలను నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం.. కేవలం 45 రోజుల్లోనే పరీక్షలను నిర్వహించేలా చేసి డీఎస్సీ అభ్యర్థులను మానసికంగా వేదనకు గురి చేసింది.

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

డీఎస్సీ-2025 పరీక్షలకు హాజరవుతున్న వారి సమస్యలు, సందేహాల సహాయార్థం పాఠశాల విద్యాశాఖ అధికారులు జిల్లా సహాయక (హెల్ప్ లైన్) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 97031 48269 (ఏడి), 9505678655 (ఏసీజీఈ), 89192 12126 (సీ.అసిస్టెంట్), 9177975250 (సీఓ)కు కాల్‌చేసి ఎలాంటి సమస్యనైనా తెలియజేయవచ్చని తెలిపారు.

ఉదయం 9, మధ్యాహ్నం 2 తర్వాత నో ఎంట్రీ..

ఉదయం షిఫ్టు 9.30కు మొదలుకానుండగా అభ్యర్థులు 9 గంటల్లోపు, మధ్యాహ్నం షిఫ్టు 2.30కు మొదలుకానుండగా అభ్యర్థులు 2 గంటల్లోపు పరీక్ష కేంద్రాలకు విధిగా చేరుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య స్పష్టంచేశారు.

నిబంధనలు విధిగా పాటించాలి



డీఎస్సీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు నిర్దేశిత సమయానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోము. నిబంధనలు పక్కాగా పాటించాల్సిందే. – డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ.

మొక్కే దిక్కు



సర్వమానవాళికి మొక్కే జీవనాధారం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితర నాయకులు అధికారులు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాత్రునివలస చెరువు గట్టుపై, పెదపాడు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, వాటి ప్రాధాన్యతను చెప్పారు.
– శ్రీకాకుళం రూరల్

క్లుప్తంగా

ఐఆర్ఎస్‌కు సాయిరాం ఎంపిక



సేనాపతి సాయిరాం

రణస్థలం: సివిల్ సర్వీస్-2025 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రణస్థలం మండలం వెల్పురాయి గ్రామానికి చెందిన సేనాపతి సాయిరాం ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఇతని తండ్రి సూర్యనారాయణ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిరాం ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షేక్ రుక్సాద్‌కు ప్రతిభా అవార్డు



ప్రతిభా అవార్డుతో షేక్ రుక్సాద్

ఇచ్ఛాపురం రూరల్: ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన షేక్ రుక్సాద్‌కు ప్రభుత్వం ప్రతిభా అవార్డు ను గురువారం అందజేసింది. ఈ మేరకు ఎం.తో టూరు ఆదిత్యా కళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. విద్యార్థి వెయ్యి మార్కులకు 982 మార్కులు సాధించారు. షేక్ రుక్సాద్ తండ్రి ఇచ్ఛాపురం పట్టణంలో టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

రెండు తులాల బంగారం చోరీ



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: బలద గ్రామానికి చెందిన కంచరాం పురుషోత్తం ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వివాహం నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లి గురువారం ఉదయం వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువా తాళాలు విరగ్గొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు వస్తువులను పట్టుకుపోయారు. అనంతరం బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రసాదరావు, క్లూస్‌టీమ్ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు ఆవు మృతి

నందిగాం: బడగాం పంచాయతీ కాశీరాజుకాశీపురంలో గురువారం పిడుగు పడి సనపల ముఖలింగంకు చెందిన ఆవు మృతి చెందింది. గ్రామ సమీప పొలాల్లో ఆవును మేతకు తీసుకువెళ్ల ఒక్కసారిగా పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వెటర్నరీ అసిస్టెంట్ సునీత ఘటనా స్థలాన్ని పరిశీలించి పశుసంవర్ధక శాఖ ఏడీ రవికృష్ణకు విషయం తెలియజేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరులో పేకాట శిబిరంపై లావేరు పోలీసులు గురువారం దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.9,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ హెచ్.జోగారావు కేసు నమోదుచేశారు.

నేటి నుంచి పెంటపోలమ్మ జామి జాతర



పెంటపోలమ్మ తల్లి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పొందరవీధిలో పెంటపోలమ్మ జామి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు గురువారం అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో నిర్వాహకులు ముస్తాబు చేశారు. డెంకివీధి, శివాలయం వీధి, పొందరవీధి, పెంటవీధి, సెగిడి వీధి, పూజారివీధి, చిన్న, పెద్ద బ్రాహ్మణ వీధులు, పల్లివీధి, హరిజన వీధి, తాటివీధి, మేధరవీధి, వెంకటేశ్వరకాలనీ, న్యూకాలనీ, మహారాణిపేట, కొండివీధి, చేపల మార్కెట్ ప్రాంతాలను అమ్మవారి జాతరకు సిద్ధం చేశారు. తొలి రోజు మహాభోగ నివేదన, అమ్మవారి దర్శనం, 7న సహస్ర కుంకుమార్చన, 8న ముగ్గురాటల సమర్పణ, 9న గాజుల అర్చన, 10న ఘటోత్సవం, రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పెంట సంజీత్‌కుమార్, ఎస్.రూప్‌సుందర్, ఉమాకాంత్, కె.విజయ్, పి.శివనాగరాజు, భగీరధి, పెంట నవీన్, రాజేంద్ర, గిరి కోరారు.

ఇసుక తవ్వేస్తూ.. ప్రాణాలు తోడేస్తూ!



రామారావు అనే వ్యక్తి స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకున్నది ఇక్కడే..

- వంశధార నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- ఎక్కడికక్కడే భారీగా గోతులు
- ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్న సామాన్యులు
- పట్టించుకోని అధికారులు



బైరి వద్ద వంశధార నదిలోకి నేరుగా వేసిన రోడ్డు ఇదే

శ్రీకాకుళం రూరల్: ఇసుక అక్రమార్కులు నిబంధనలకు తూట్లుపొడుస్తున్నారు. నదిలో ఇష్టారాజ్యంగా యంత్రాలతోనే భారీ ఎత్తున తవ్వకాలు చేస్తున్నారు. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరు ఆ గోతుల్లో చేరుతోంది. వాటిని గమనించని సామాన్యులు ప్రమాదవశాత్తు దిగి కూరుకుపోయి మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో చోటు చేసుకుంది.

ఆదేశాలు బేఖాతరు..

వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో అనుమతులకు మించి తవ్వకాలు చేస్తున్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. జిల్లా కలెక్టర్ సైతం అక్రమ తవ్వకాలపై కన్నెర్ర చేసినా రెవెన్యూ, మైన్స్ అధికారులు తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. బైరి, కరజాడ పరిసర ప్రాంతాల్లో పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇసుక దందా సాగుతోంది. నదిలో ఎక్కడికక్కడే భారీగా గోతులు తవ్వేస్తూ వదిలేస్తున్నారు. ఇప్పటికే ఇసుక తవ్వకాలు నిత్యం చేపట్టడంతో వ్యవసాయ బోరులు సైతం పాడైపోయాయని పరిసర ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కడికక్కడే తవ్వకాలు చేయడంతో గత నెలలో బైరి గ్రామానికి చెందిన గొర్లె రామారావు అనే వ్యక్తి వంశధార నదిలోకి స్నానానికి వెళ్లినప్పుడు భారీగా ఏర్పడిన గోతులో కూరుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇలాంటి గోతులే నదిలో ఎక్కడికక్కడ ఉన్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు మాత్రం అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. అనుమతులకు మించి తవ్వకాలు చేయడం, ఎక్కడికక్కడే గోతులు ఏర్పడటం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ పలకలతో ఇసుక ర్యాంప్..

బైరి ర్యాంప్‌ను ఆనుకొని ఏకంగా నదీ గర్భంలోకే గ్రానైట్ పలకలతో కూడిన ర్యాంప్‌ను రోడ్డు మాదిరిగా వేసేశారు. దీని మీదుగా పెద్దపెద్ద వాహనాలు వెళ్తూ ఇసుక లోడింగ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారంలో కూలీలతో ట్రాక్టర్లకు ఇసుక నింపాల్సి ఉండగా 200 హైస్పీడ్‌తో కూడిన ప్రొక్లెయినర్లతో ఇక్కడ వినియోగిస్తున్నారు. ఫలితంగా నదీగర్భంలో ఎక్కడికక్కడే పెద్దపెద్ద గోతులు ఏర్పడి సామాన్యుల ప్రాణాలకు మీదకు వస్తోంది.

అనుమతులకు మించి తవ్వకాలు



బైరి గ్రామంలో అనుమతులకు మించి అక్రమంగా తవ్వకాలు చేయడంతో ఇటీవల మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్నానానికి దిగి చనిపోయాడు. అయినా తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. నదీ పరివాహక ప్రాంతంలో ఏదో ఒక మూల తవ్వేస్తూ ఉన్నారు. అధికారులు గానీ, సచివాలయ సిబ్బంది గానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– ఎండి అసిరినాయుడు, ఉపసర్పంచ్, బైరి గ్రామం

తవ్వకాలు వాస్తవమే..

బైరి ప్రాంతంలో ఇసుక తవ్వకాలు నిత్యం జరుగుతున్నాయి. ఈ ర్యాంపును శ్రీ వెంకటేశ్వర మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు నిర్వహిస్తున్నారు. నదిలోకి నేరుగా గ్రానైట్ పలకలతో కూడిన ర్యాంప్ వేశారు. ఇచ్చిన అనుమతులు కన్నా ఎక్కువగానే తవ్వేస్తున్నారు.

– శ్రీనివాసరావు, బైరి వీఆర్ఓ

ఆరిపోయిన ఆశా దీపాలు

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థులు మృత్యువాతపడ్డారు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చారు. కన్నవారి ఆశలను అడియాసలుగా మిగిల్చి వెళ్లిపోయారు. వైద్యసేవల కోసం ఆస్పత్రికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతిచెందగా.. స్నేహితుడి సోదరి వివాహ వేడుకకు వచ్చి బావిలో దిగి మరో విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

• వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో 6వ తరగతి విద్యార్థిని మృతి.. తండ్రికి తీవ్ర గాయాలు
- ఆమదాలవలస ఐ.జె.నాయుడు కాలనీలో విషాదఛాయలు



కేతన(ఫైల్)



ఘటనా స్థలంలో కేతన మృతదేహం. పక్కనే తీవ్ర గాయాలతో తండ్రి కాళిదాసు

బూర్జ/ఆమదాలవలస : ఆస్పత్రికి వెళ్తున్న ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి వెళ్తుండగా ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో బండి అదుపు తప్పడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆమదాలవలస పట్టణంలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీకి చెందిన కాయల జ్యోతి (కేతన)(13) కొన్నాళ్లుగా ముక్కు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం ప్రతి నెలా రాజాం జీఎంఆర్ ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం తండ్రి కాళిదాసుతో కలిసి రాజాంలోని ఆసుపత్రికి బైక్‌పై బయలుదేరారు. బూర్జ మండలం గుత్తావిల్లి దాటాక లాభాం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఎదురుగా ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయి కాళిదాసు సడన్‌గా బ్రేక్ వేశాడు. బైక్ అదుపు తప్పడంతో వెనుక కూర్చున్న కేతన కిందపడి రోడ్డును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో కాళిదాసు ఎడమ చెయ్యి నుజ్జునుజ్జుగా మారింది. వెంటనే స్థానికులు స్పందించి కాళిదాసును జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మృతురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేతన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా, కాళిదాసు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. గతంలో ఓసారి రోడ్డు ప్రమాదం జరగడంతో గాయపడ్డాడు. దీంతో తన జాబ్‌ను భార్య రాజేశ్వరికి అప్పగించాడు. ప్రస్తుతం కుటుంబ పోషణ రాజేశ్వరిపైనే ఆధారపడి ఉంది. కేతన స్థానిక భవిత స్కూల్‌లో 6వ తరగతి చదువుతుండగా, చెల్లి రెండో తరగతి చదువుతోంది. కేతన మృతివార్త తెలియగానే ఐ.జె.నాయుడు కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.



బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

• పెళ్లి వేడుకకు వచ్చి పరలోకానికి..

- బావిలో స్నానానికి దిగి బీటెక్ విద్యార్థి మృతి



అజిత్‌కుమార్ (ఫైల్)

జి.సిగడాం: స్నేహితుడి సోదరి వివాహ వేడుకకు వచ్చిన ఓ యువకుడు బావిలో దిగి ఈతరాక మృత్యువాతపడ్డాడు. ఈ విషాద ఘటన జి.సిగడాం మండలం పెంట గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండల కేంద్రానికి చెందిన దుగ్గాన అజిత్‌కుమార్(19) విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి సెలవులకు సాలూరు వచ్చాడు. తన స్నేహితుడు తామాడ మహేష్ సోదరి పెళ్లి వేడుక కోసం స్నేహితులు తామాడ మహేష్, చిట్టివలస కుమార్, రాజుతో ఈ నెల 4న సంతకవిటి మండలం మామిడిపల్లి వచ్చారు. సాయంత్రం పూట అందరూ బయటకు వచ్చి జి.సిగడాం మండలం పెంట గ్రామంలో నేల బావి వద్దకు వెళ్లారు. ముందుగా అజిత్‌కుమార్ బావిలో దిగి ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. వెంటనే స్నేహితులు బావిలో దిగి రక్షించే ప్రయత్నం చేయగా సాధ్యం కాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు హుటాహుటిన బావి వద్దకు చేరుకుని బయటకు తీసేసరికే అజిత్‌కుమార్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు గురువారం తెలిపారు. వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు, వీఆర్ఏ బాలకృష్ణ సమక్షంలో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి



డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అభివృద్ధి పథంలో పయనించేందుకు తనవంతుగా కృషిచేస్తానని బ్యాంక్ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శ్రీకాకుళంలోని దండివీధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణ పదవీబాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, డీసీసీబీ సీఈఓ దత్తి సత్యనారాయణ, డీసీఓ బి.నగేష్, బ్యాంక్ అధికారులు డి.వరప్రసాదరావు, ఎస్‌వీఎస్ జగదీష్, ఎస్‌వీ సత్యనారాయణ, సీహెచ్ బసవలింగం, ఎస్.రమేష్, జి.సునీల్, జి.రామకృష్ణారావు, భాస్కరరావు, దశరధరాం, బాబ్జి పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలకు అతి ముఖ్యమైన విద్యుత్, కుళాయిల ద్వారా తాగునీరు వంటి సేవలను అంతరాయం లేకుండా అందిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల గౌరవ అధ్యక్షుడు తిరుపతిరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, వై.శ్యామలరావు , ఆర్.సతీష్ అన్నారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రాకుంటే వాటిని సైతం నిలిపివేయకతప్పదని స్పష్టం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం ఎదుట 22వ రోజైన గురువారం కూడా నిరవధిక సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డీపీఓ, సెక్యూరిటీ గార్డ్స్, పార్క్ వర్కర్లు, గ్యాంగ్ మజ్దూర్, వాటర్ వర్కర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, అటెండర్లు పాల్గొన్నారు.

నాలుగు కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి పూణేకు 4.18 కిలోల గంజాయి తరలిస్తున్న ఎలియా రైత అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు సీఐ ఎం చిన్నంనాయుడు తెలిపారు. ఒడిశా రాష్ట్రం లుహకంటి గ్రామానికి చెందిన ఎలియా రైతా తన సోదరుడు జోహర్ రైతాతో కలిసి కుంజన ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు చెందిన రాఖేష్ సుదంప్లంజ్(చాచా)కు అమ్ముతుండేవారు. ఈ క్రమంలో ఎలియా రైతా రెండు ప్యాకెట్ల గంజాయితో బరంపురం నుంచి ఇచ్ఛాపురం వచ్చాడు. రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా గంజాయి గుర్తించడంతో అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

అకడమిక్ అంశాలపై దృష్టి సారించండి



శిక్షణ పొందిన ఉపాధ్యాయుడికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న గిరిజాశంకర్, తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యాసంబంధిత అంశాలతోపాటు అకడమిక్ అంశాలపై దృష్టి సారించాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అకడమిక్ అంశాలపై జరుగుతున్న జిల్లాస్థాయి డీఆర్పీల మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు అకడమిక్ అంశాలైన క్యాలెండర్, హ్యాండ్‌బుక్, అసెస్మెంట్, కరికులం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర పరిశీలకులు గిరిజా శంకర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మూడవ విడత ట్రైనింగ్‌లో ప్రతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అకడమిక్ అంశాలపై శిక్షణ పొందాలన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస మూడు డివిజన్ల పరిధిలో ఉపాధ్యాయులకు తాజాగా శిక్షణ పొందిన డీఆర్పీలతో శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులంతా హాజరుకావాల్సిందేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఉప విద్యాశాఖ అధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియం, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, వమ్మరవల్లి డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకే శిక్షణలపై అవగాహన



మాట్లాడుతున్న కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చిట్టిబాబు

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్లలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం వికసిత కృషి సంకల్పిత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదావలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బి.చిట్టిబాబు, డాక్టర్ బి.సునీతలు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో అమలుచేస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఉద్యాన పంటలు, నారు, కోళ్లు, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.లక్ష్మణరావు, వ్యవసాయాధికారులు రేవతి, అరుణకుమారి, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వ్యాన్

- డ్రైవర్ దుర్మరణం



సురేంద్రరెడ్డి మృతదేహం



ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

నందిగాం : మండలంలోని పెద్దబాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా హనుమపూర్‌కు చెందిన వంగేటి సురేంద్రరెడ్డి (38) తన వ్యాన్‌లో ఎల్‌సీడీ టీవీ స్క్రీన్‌ల లోడ్‌తో హైదరాబాద్ నుంచి భువనేశ్వర్‌కు బయలుదేరాడు. పెద్దబాణాపురం వచ్చేసరికి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అదుపు తప్పి ఢీ కొట్టాడు. దీంతో వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని బయటకు తీసి 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేంద్రరెడ్డి మృతి చెందాడు. నందిగాం ఎస్సై మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కంచమ్మతల్లి సంబరాలు



కంచమ్మతల్లి అమ్మవారి ఊరేగింపు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కంచమ్మతల్లి గ్రామ దేవత సంబర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సాయంత్రం మొదలైన అమ్మవారి తిరువీధుల ఊరేగింపు అర్ధరాత్రి 2 గంటల వరకు సాగుతోంది. జనం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఎస్.ఆర్.సి.పురం కాలనీ, మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణం, కంచమ్మతల్లి కాలనీ తదితర వీధుల్లో అమ్మవారి ఊరేగింపు కొనసాగింది.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER

Banks, SSC, RRB, Defence & NAVODAYA & SAINIK SCHOOL. New Batches Started. Surya Academy, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V- 6745]

WANTED

RK ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు వంట మాస్టర్స్, టిఫిన్ మాస్టర్స్, వార్డెన్స్, స్కావెంజర్స్ (బాత్ రూమ్స్ క్లీన్ చేయుటకు) వెంటనే కావలెను. సంప్ర: కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. సెల్: 97014 73399 [G-44]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15911]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.